# మ్యారేజెస్ అర్ మేడ్ ఇన్ మ్యాచ్‌మేకర్

తాటిపాముల మృత్యుంజయుడు






ప్రవాసాంధ్ర సంస్థలు దాదాపు తాము నిర్వహించే ప్రతి కార్యక్రమంలోనూ ఒక హాస్యనాటిక ప్రదర్శించడం ఆనవాయితీ. ప్రపంచవ్యాప్తంగా వున్న తెలుగు వారెవరైనా సరదాగా ప్రదర్శించి హాయిగా నువ్వుకోడానికి వీలైన హాస్య ప్రహసనాల్ని నెలకొకటి మీకందిస్తున్నాం. ఈ గల్పికల్ని ఎవరైనా ప్రదర్శించుకోవచ్చు.ఎక్కడ ప్రదర్శించినా రచయితపేరు ప్రకటించవల్సిందిగా విజ్ఞప్తి. ప్రదర్శనగురించి మాకు తెలియచేసి, ఫోటోలు పంపిస్తే మేము సుజనరంజనిలో ప్రచురిస్తాం.

పాత్రలు:

కళ్యాణ్ - 30 సంవత్సరాలు (సాఫ్ట్‌వేర్ ప్రొఫెషనల్)
పాపారావు, సుబ్బారావు, రాంమోహన్ (పెళ్ళి చేసుకోవాలనుకొంటున్న అబ్బాయిలు )
లక్ష్మి, సృజన (పెళ్ళీడుకొచ్చిన అమ్మాయిలు)
కాంతం (ఇంకో అమ్మాయి)

ఆహార్యం:

ఆహార్యం: లాప్‌టాప్, టేబుల్, 7 కుర్చీలు, ఫోను, కొన్ని కంప్యూటర్ పుస్తకాలు, మాగజైన్లు

(తెర ఎత్తగానే కుర్చీలో కూర్చొని వుంటాడు కళ్యాణ్. పుస్తకాల పేజీలను అటూ ఇటూ తిరగేస్తుంటాడు. లాప్‌టాప్ లోనికి చూస్తుంటాడు. దీర్ఘంగా ఆలోచిస్తుంటాడు. టేబుల్ మీద ఫోను మోగుతుంది.)

**కళ్యాణ్:** (ఫోన్‌లో) హలో రతన్‌జీ!... నిన్ననే మనం మార్కెట్లోకి రిలీజ్ చేసిన Beta versionకి మంచి రెస్పాన్స్ వచ్చింది... దాదాపు పన్నెండు గంటల్లో ఓ వెయ్యి మంది register చేసుకున్నారు... మన product అనుకున్న విధంగానే పని చేసింది... అంటే మ్యారేజ్ ఫీల్డులో నేను సృష్టించిన కొత్త ఒరవడి సక్సెస్ అయినట్టే. సారీ! నేను గర్వంగా ఫీలవుతున్నాని ఏమనుకోవద్దు... ఈ విజయంతో సంతోషం ఆపుకోలేకపోతున్నాను...
మన ప్లాన్ ప్రకారం నిన్న మన MatchMaker కూర్చిన ఓ ఐదు జంటలను పర్సనల్ గా మాట్లాడటానికి పిలిచాను. వాళ్ళతో మాట్లాడితే మనకు మరిన్ని విషయాలు తెలుస్తాయి. వాటిని మన ప్రోడక్ట్ next versionలో implement చెయ్యొచ్చు... అలాగే... ఒక బిలియన్ భారతదేశ జనాభాలో ఏ సమయంలోనైనా కనీసం 10 శాతం పెళ్ళీడుకొచ్చి పెళ్ళి చేసుకోవాలనే ఆలోచనలో వుంటారు... అందులో కనీసం ఒక శాతం యువత మన ప్రోడక్ట్ వుపయోగించనా మనకు ఒక మిలియను customers వుంటారు... Thanks for having confidence in me...మీలాంటి investors కొత్త ఐడియాలకు అర్థికంగా చేయూతనిస్తేనే కదా

కొత్త technology ప్రజలకు అందుబాటులోకి వచ్చేది... అలాగే... సాయంత్రం కాల్ చేస్తాను... బై.

(ఫోను పెట్టేసి) యాహూ! నేను computersలో ఒక అద్భుతాన్ని సృష్టించాను. నా మేధకు, నేను పడ్డ కష్టానికి తగ్గ ఫలితం లభించింది. పేరుకు పేరు, డబ్బుకు డబ్బు వస్తుంది. 'Kalyan is genius' అని అందరు పొగుడుతారు.
(టై సర్దుకొంటుంటే సుబ్బారావు లోపలికి వస్తాడు.)

**సుబ్బారావు:** హలో కళ్యాణ్‌గారు! ఐ యాం సుబ్బారావ్!

**క:** హలో సుబ్బారావ్ గారు! వెల్‌కం. Thanks for using our innovative online product for selecting your life partner. మా ప్రోడక్ట్ ఉపయోగించిన మొదటి యాభై మందిలో మీరున్నారు కాబట్టి మీతో మాట్లాడటానికి పిలిపించాను.

**సు:** మీ మ్యాచ్ మేకర్ సెలెక్ట్ చేసిన రాగిణి నాకు అన్ని విధాలా సరిపోతుంది. మా బామ్మకి మా బాగా నచ్చింది. ఇక ఆమె హాయిగా చావొచ్చు.

**క:** (కంగు తిని) అదేంటండి సుబ్బారావు గారు! 'శుభం పలకరా పెళ్ళికొడుకా అంటే పెళ్ళికూతురు...' అని అదేదో సామెత చెప్పినట్టు మీరు అశుభం మాట్లాడుతున్నారు. మా మ్యాచ్ మేకర్ సెలెక్ట్ చేస్తే మీ బామ్మ చావడమేంటండి.

**సు:** సారీ కళ్యాణ్ గారు. మరోలా అర్థం చేసుకోకండి. నిన్నటి వరకు ఆవిడకు – 'మన సుబ్బిగాడికి ఎలాంటి భార్య వస్తుందో? గయ్యాళి దొరికితే ఎలా నెగ్గుకొస్తాడో? ఈ అమాయకపు పక్షికి ఓ మంచి పిల్ల దొరికితే పెళ్ళి చూసి నిశ్చింతగా కళ్ళు మూస్తాను' అంటూ రోజూ బాధ పడేది.

**క:** మీరు లౌక్యం లేకుండా చాలా ఓపెన్‌గా మాట్లాడుతున్నారు. నో డౌట్, మీ బామ్మ అలా ఎందుకు వర్రీ అయ్యేదో అర్థం చేసుకోవచ్చు.

**సు:** అసలు నేను పెళ్ళి చేసుకోకూడదని మంకు పట్టి కూర్చున్న తరుణంలో మీ software రిలీజ్ అయ్యింది. లేకుంటే ముదిరిన బెండకాయలా మిగిలి పోయేవాణ్ణి.

**క:** మీరు 'పెళ్ళి చేసుకోను' అని తీసుకున్న దీక్షకు కారణమేంటో?

**సు:** అదొక పెద్ద విషాద గాధ. ఫ్లాష్‌బ్యాక్ లోకి వెడితే పెద్ద సినిమా కథ అవుతుంది.

**క:** ఇప్పుడవన్ని వద్దులెండి. All is well that ends well. మీకు మ్యాచ్ చేయబడ్డ రాగిణి ఏ క్షణంలోనైనా రావచ్చు. అప్పటివరకు ఈ మాగజైన్ చదవండి.
(మాగజైన్ మొహానికి అడ్డంగా పెట్టుకొని చదువుతుంటాడు సుబ్బారావు. రాంమోహన్ లోనికి వస్తాడు.)

**రాంమోహన్:** హలో కళ్యాణ్‌గారు. ఐ యాం రాంమోహన్.

**క:** హల్లో రాంమోహన్‌గారు. రండి. కూర్చోండి. (రాంమోహన్ కూర్చుంటాడు) చెప్పండి, మా మ్యాచ్ మేకర్ లో మీకు నచ్చిన అంశాలు ఏంటి?

**రాం:** పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న matrimonial వెబ్‌సైట్లతో చూస్తే మీ మ్యాచ్‌మేకర్ అవుట్‌స్టాండింగా వుంది. ఎత్తు, వెడల్పు, కులం, గోత్రం మొదలైన పాతచింతకాయ పచ్చడిలాంటి డీటైల్స్‌తో పాటు ఇంకా యాభైకి పైగా వేరే డీటైల్స్ తీసుకోవటం, డీటైల్స్ ఫీడ్ చేసిన వెంటనే తగిన పార్ట్‌నర్‌ను వెదకటం, మ్యాచ్ చేయబడ్డ ఇద్దరికి ఈమెయిల్ పంపించటం, ఇంకా చాలా మంచి ఫీచర్స్ ఉన్నాయండీ మీ సాఫ్ట్‌వేర్‌లో.

**క:** Thanks for that feedback. ఓ ఆడా, మగా పెళ్ళి చేసుకోవాలంటే, వాళ్ళ గతమేమిటీ, ఇప్పటి పరిస్థితి ఏమిటి, వాళ్ళు

భవిష్యత్తులో ఏమి ఆశిస్తున్నారు, మొదలగు అంశాలను పరిగణలోకి తీసుకోవాలి. అప్పుడే వాళ్ళు pefect match అవుతారు. మా ప్రోడక్ట్ auto matchmaking ఒక కాంప్లికేటెడ్ ప్రోసెస్.

సు: అంటే మీరు 'అభినవ పెళ్ళిళ్ళ పేరయ్య' అన్న మాట. (మళ్ళీ మాగజైన్ మొహానికి అడ్డం పెట్టుకొని చదువుతుంటాడు)

క: థాంక్స్ సుబ్బారావుగారు. మా ప్రోడక్ట్ 'Marriage are made in MatchMaker' అన్న కొత్త నానుడికి శ్రీకారం చుట్టింది.

(సృజన, సుబ్బలక్ష్మి లోనికి వస్తారు)

లక్ష్మి: నమస్కారమండీ! నా పేరు లక్ష్మి.

సృజన: హలో! ఐ యాం సృజన

క: వెల్కం, స్వాగతం! లక్ష్మిగారు, మీకు మ్యాచ్ చేయబడ్డ పాపారావు గారు ఇంకా రాలేదు. వేయిట్ చెయ్యండి. సృజనగారు, ఇతనే మీకు మ్యాచ్ అయిన మిస్టర్ రాంమోహన్.

(సృజన, రాం మోహన్ హలో అంటూ చేతులు కలుపుతారు)

క: ఆహా! మిమ్మల్ని పక్కపక్కన చూస్తుంటే ఒకరికొకరు సరిజోడులా వున్నారు. ఒకరు డాక్టరు, మరొకరు ఇంజనీరు. మీ ఆ-శయాలకు తగ్గట్టు మీరు వచ్చే అయిదేళ్ళలో గ్యారంటీగా మిలియనీర్స్ అవుతారు.

రాం: థాంక్స్ కళ్యాణ్‌గారు! యు అర్ ఎ జీనియస్

(కళ్యాణ్ ఉబ్బితబ్బివుతుంటాడు)

సు: (మొహానికి అడ్డంగా వున్న మ్యాగజైన్ తీసి) అవును, నిజమే. మిమ్మల్ని చూస్తుంటే ఎక్కడో చెట్టుమీద కాయుని, సముద్రంలో నున్న ఉప్పును తీసుకొచ్చి పర్ఫెక్ట్‌గా కలిపినట్టుంది. (లక్ష్మిని చూసి) మిమ్మల్ని ఎక్కడో చూసినట్టుంది.

ల: అవును. నాక్కూడా ఇంతకు ముందు మిమ్మల్ని ఎక్కడో చూసినట్టుంది.

క: అయితే మీరలా మీ పార్ట్‌నర్స్ వచ్చేంత వరకు పక్కకెళ్ళి మాట్లాడుకోండి.

(సుబ్బారావు, లక్ష్మి పక్కకెళ్ళి మాట్లాడుకుంటారు. ఇంతలో పాపారావు లోనికి దూసుకొని వస్తాడు.)

పాపారావు: ఎక్కడ? నా జీవిత భాగస్వామి ఎక్కడ?

క: హలో సార్! ఇక్కడ మేము పెళ్ళి చేసుకోడానికి అమ్మాయిల్ని అరేంజ్ చెయ్యం. మీరు మా మ్యాచ్‌మేకర్‌లో రిజిస్టర్ చేసుకోవాలి. ఇంతకీ మీరెవరు?

పా: ఆ ఫార్మాలిటీస్ అన్ని ఎప్పుడో అయ్యాయి. ఇంతకీ నా ఊహా కల్పన ఎక్కడ?

క: ఓ! అంటే మీరు పాపారావుగారా! కల్పన ఎప్పుడైన రావచ్చు. అంతవరకు కూర్చోండి.

(పాపారావు అసహనంగా కూర్చుంటాడు. రాంమోహన్, సృజన కుర్చీలు దగ్గరికి జరుపుకొని మాట్లాడుతుంటారు.)

సు: ...అంటే నువ్వు నా సుబ్బలక్ష్మివి కదూ!

ల: అంటే నువ్వు నా చిన్నప్పటి సుబ్బువు కదూ.

సు: సుబ్బీ! ఇది కలయా, నిజమా?

(సుబ్బారావును లక్ష్మి గిల్లుతుంది. సుబ్బారావు కెవ్వుమంటాడు.)

ల: సుబ్బూ! ఇది నిజమే.

(ఇద్దరు చేతులు పట్టుకొంటారు)

క: (కంగారు పరుగెత్తుకొచ్చి, ఇద్దరి చేతులు విడిపిస్తూ) సుబ్బారావుగారు, లక్ష్మిగారు! ఏమిటీ తెలివితక్కువ పనులు. మీకు మ్యాచ్ చేయబడ్డ పార్ట్‌నర్స్ వేరు.

సు: కళ్యాణ్‌గారు! నా మ్యాచ్ రాగిణి సంగతేమో గాని, నా సహచారిణి ఈ సుబ్బలక్ష్మియే.

ల: అవును. చిన్నప్పటినుండి నా అభిమాన హీరో ఈ సుబ్బారావే.

క: మీ సంగతేమి నాకర్థం కావడం లేదు.

సు: నాకో పెద్ద ఫ్లాష్‌బ్యాక్ అన్నానే. ఇదే అది.

ల: చిన్నప్పుడు విడిపోయిన ప్రేమికులం ఇప్పుడు కలుకుంటున్నాం.

సు: (లక్ష్మితో గోముగా) ఇన్ని రోజులు ఎక్కడికెళ్ళావమ్మా? రైలులో ప్రయాణం చేసినప్పుడల్లా ఆగిన ప్రతీ స్టేషన్‌లో నీవు కనబడతావని తెగ వెతికేవాడిని.

క: అంటే... లక్ష్మిగారు చిన్నప్పుడు ఏదైనా రైలులో తప్పిపోయారా?

ల: కాదు. మా నాన్నగారు రైల్వే స్టేషన్ మాస్టారు. వారికి ట్రాన్స్‌ఫర్ అయిన తర్వతా మేం విడిపోయాం. (సుబ్బారావుతో) సుబ్బూ! మా నాన్నగారు తొందరగా వాలెంటరీ రెటైర్మెంట్ తీసుకొన్నారు. అందుకొరకే నీకు కనిపించలేదోమో. (మళ్ళీ దగ్గరవుతారు)

క: నాకేం చెయ్యాలో అర్థం కావటం లేదు.

సు: మీరేమి చెయ్యనక్కర్లేదు. మీ మ్యాచ్ మేకర్ మంచి పనే చేసింది. బాల్య ప్రేమికుల్ని ఇలా కలిపింది.

క: కరక్టే కావచ్చు. మరి రాబొయే మీ పార్ట్‌నర్స్ ఏం చేప్పాలి.

ల: మేమెక్కవలసిన రైలు ఒక జీవితకాలం లేటు కాకూడదు. అందుకే మేం వెళ్ళిపోతున్నాం.

(ఇద్దరూ బై అంటూ వెళ్ళిపోతారు)

(ఇంతలో రాం మోహన్ సెల్‌ఫోను మోగుతుంది.)

రాం: (ఫోన్‌లో) హలో! దిస్ ఈజ్ రాం హియర్! ఏమిటీ బాస్! మన కంపెనీ మూసేస్తున్నారా? మనమంతా లేఆఫ్ చెయ్యబడ్డామా? దిస్ ఈజ్ రియల్లీ బ్యాడ్ న్యూస్. మళ్ళీ మాట్లాడుతాను. (ఫోను మూసేస్తాడు)

రాం: సారీ సృజన. నాకిప్పుడు ఉద్యోగం లేదు. పెళ్ళి చేసుకోటానికి కొన్ని నెలలు ఆగాలేమో.

క: మీరేం వర్రీ కానక్కరలేదు. మీకు తప్పక వుద్యోగం వస్తుంది.

సృ: డొంట్ వర్రీ కళ్యాణ్. నేనప్పటి వరకు ఒంటరిగా వుంటే అప్పుడు pursue చేద్దాం.

క: ఏం మాట్లాడుతున్నారు సృజనగారు. పెళ్ళిని బిజినెస్‌లా చేస్తూ pursue అంటూ మాట్లాడుతున్నారు. అది మీకు భావ్యం కాదు.

సృ: అవునండి. నేను అందరి అమ్మాయిల్లా కాకుండ కొద్దిగా మెటీరియలిస్టిక్‌గా అలోచిస్తాను. అవునూ మీకు ఇంతకూ పెళ్ళి అయిందా?

క: కాలేదు. ఇంకా బ్రహ్మచారినే!

సృ: రాం ఇంతకు ముందు మిమ్మల్ని జీనియస్ అని ఒప్పుకొన్నాడుగా. అయితే నేను మిమ్మల్ని పెళ్ళెందుకు చేసుకోకూడదు.

క: నో, నో, నో. అవన్నీ ఇప్పుడు మాట్లాడం తగదు.

సృ: ఆలోచించండి. నేను డాక్టర్ని. గోల్డ్‌మెడలిస్ట్‌ని. ఒకరికొకరం సరిపోతామేమో మీ మ్యాచ్‌మేకర్ని అడగండి. I keep this deal open for a month. (వెళ్ళిపోతుంది)

రాం: (విషాదంగా) నా పెళ్ళి క్లైమాక్స్ చేరుకోక ముందే ప్రేమికుడు జొరబడ్డాడు. ఇది చాలా అన్యాయం కళ్యాణ్ గారు.

(వెళ్ళిపోతాడు)

**పా:** (పాడుతూ అటూ ఇటూ తిరుగుతుంటాడు) ఇది ఒక కల్పన, అది ఒక కల్పన, ఇది నా కల్పన, ఊహా కల్పన...

**క:** (చిరుకోపంతో) పాపారావు గారు! ఇదేంటి. మీరు కాలుగాలిన పిల్లిలా 'మ్యావ్' అంటూ అరుస్తూ తిరిగుతున్నారు.

**పా:** నాకు తొందరగా కల్పన కావాలి. రిజిస్టర్ ఆఫీసుకెళ్ళి పెళ్ళి చేసుకోవాలి. కల్పనతో అమెరికా వెళ్ళి హాయిగా జీవించాలి.

**క:** ఓర్నాయనోయ్! కళ్యాణం వచ్చినా, కక్కొచ్చినా ఆగదంటారు. ఇదే కాబోసు.

(ఇంతలో కాంతం చేతిలో పూరీల కర్రతో లోపలికి వస్తుంది)

**కాంతం:** ఎక్కడున్నావురా బడుద్దాయి. నేను నిన్ను అంత ఈజీగా వదులుతానా?

(పాపారావు పరిగెత్తబోతుంటే కాంతం పట్టుకొంటుంది)

**క:** ఏయ్! ఎవరమ్మా నీవు? నా ఆఫీసులోకొచ్చి నా కస్టమర్ మీద దౌర్జన్యం చేస్తున్నావ్.

**కాం:** నా మొగుడు, నా ఇష్టం. తప్పు చేస్తుంటే శిక్షిస్తాను. అడగటానికి మీరెవరు?

**క:** ఆ! మీకింతకు ముందే పెళ్ళయిందా పాపారావు గారు?

**కాం:** అతనేం మాట్లాడుతాడు. నే చెప్పేది వినండి. ఈయనకు ఈ మధ్య అమెరికా వెళ్ళాలని పిచ్చి బాగా పట్టుకొంది. అందుకు పెద్దగా చదువుకోని నేను సరిపోనని అమెరికా వెళ్ళే అమ్మాయిని పెళ్ళి చేసుకోవాలనుకొంటున్నాడు. నిన్నటినుండి వెర్రిగా ప్రవర్తిస్తుంటే అనుమానం వచ్చి అతని కంప్యూటర్ చూసాను. మీ మ్యాచ్ మేకర్ నుండి వచ్చిన ఈమెయిల్ అగుపడింది.

**క:** అమ్మో! ఎంత పెద్ద గండం తప్పింది. కొద్దిగా ఆలస్యం అయితే వీసాతో వుద్యోగానికి అమెరికా వెళ్ళనున్న కల్పనను కలిసేవాడే అందుకే కాబోలు 'కల్పన, పెళ్ళి, అమెరికా' అంటూ కలవరిస్తున్నాడు.

**కాం:** అది అంత సులభం కాదు లెండి. ఈ పాపారావుతో మూడుముళ్ళు గట్టిగానే వేయించుకొన్నాను. (పాపారావుతో) ఊ! పదండి ఇంటికి.

**పా:** ఇది ఒక కల్పన, అది ఒక కల్పన, ఇది నా కల్పన, అభూత కల్పన...

(పాడుతూ వుంటే బయటికి వెడుతారు. కళ్యాణ్ జుట్టు పీక్కుంటుంటే ఫోను మోగుతుంది)

**క:** (ఫోన్‌లో) హలో రతన్‌జీ! ... పెర్సనల్ ఇంటర్వ్యూస్ ఇప్పుడే ముగిశాయి... కాని నా మ్యాచ్ మేకర్ గురించి తిరిగి సీరియస్‌గా ఆలోచిస్తున్నాను... ఎందుకంటారా... Match Making algorithm ఎంత బాగా implement చేసినా ... ఈ మనుషుల ఫీలింగ్స్, దుర్బుద్ధి implement చేయగలిగే technology ఇంకా develop కాలేదేమో... అప్పటి వరకు నా కల నిజం కాదేమో... అప్పటి వరకు నేను 'Marriage is a lottery' అన్న సత్యాన్నే నమ్ముతాను... సారీ. (ఫోను మోగుతుంది)

(ఫోను ఎత్తి) హలో రిసెప్షనిస్ట్! ఏమిటీ!... ఆ విజిటర్ పేరేమిటీ... గజదొంగ గంగులా... మన వెబ్‌సైట్లో రిజిస్టర్ చేసుకొంటే మ్యాచ్ చూపించలేదని కోపంగా వున్నాడా... చేతిలో దుడ్డుకర్ర కూడా వుందా... ఓర్నాయనోయ్... వాడు తల్చుకొంటే ఇక దెబ్బలకు కొదవేంటి... ఓ పని చేద్దాం... నేను బ్యాక్ డోర్ నుండి ఉడాయించేస్తాను... నువ్వు వీలు చూసుకొని చెక్కెయ్... లేకుంటే ప్రాణాలకే ప్రమాదం...

(లాప్‌టాప్ తీసుకొని పరిగెడుతుండగా తెర)